పెద్ద కథ

# తుఫాను

తాతా మనుమలు వీధిలోకెళ్ళి యింకా రాలేదు.

ఆమె చల్లని వెన్నెలలో డాబా మీద పచారు చేస్తూంది.

మండు వేసంగి పగలల్లా తాపమెత్తించి, సాయంత్రానికి చల్లబడింది. ఉక్క తగ్గక పోయినా పుచ్చపువ్వులా వున్న వెన్నెల కొంత హాయి కలుగజేస్తుందని సావిత్రి డాబామీదకు వెళ్ళింది.

ఆమె భర్తపోయి ఐదేళ్ళయింది. కాని అతని స్మృతి ఆమెనింకా నీడలా వెంటాడుతూనే వుంది. సావిత్రి పెద్దయింటి పిల్ల. పెద్ద యింటిలో పడ్డది. పుట్టినింటిలో, మెట్టినింటిలో దేనికీ కొదవలేదు. అలాంటివాళ్ళకి, అందులోనూ అందంగా వున్నవాళ్ళకి వుండవలసిన గర్వం ఆమెలో లేకపోలేదు.

అయితే ఆమెలో మంచి సంస్కారం ప్రాజ్ఞత వున్నాయి. అంచేత ఆధునిక సంస్కారం అబ్బిన సాధారణ తరుణులవలె ఆమె విలవిలలాడిపోదు. మాటలలో అనవసరంగా భేషజానికి ఆంగ్ల పదాలు వాడదు.

దానికి కారణం వుంది. తండ్రికి కూతురైనా కొడుకైనా ఆమె వొక్కతే. అల్లారు ముద్దుగా పెరిగింది. బడిలో ఆంగ్లం, యింటివద్ద సంస్కృతం నేర్చుకునేది. హైందవపురా సంస్కారం, ప్రాజ్ఞత, అదుపులో వర్తించే గుణం, ఆత్మ పరీక్ష చేసుకునే తత్వం సంస్కృత గ్రంథపఠనవల్ల యెక్కువగా అబ్బుతుంది. అది ప్రస్తుతం మనదేశంలో చలామణీలోవున్న హూణ విద్యావిధానంలో లేదనే చెప్పాలి. ఈ తారతమ్యం పురుషులలోకన్న స్త్రీలలో త్వరగా, యెక్కువగా చూడగలగడానికి వాళ్ళ మనస్తత్వమే కారణం గాబోలు.

భర్తపోయిన దగ్గరనుంచీ పైపైకి గాంభీర్యం నటిస్తున్నా ఆమె లోలోపల తన జీవితాన్ని ఒక పెద్ద సమస్యగానే చూస్తూంది.

చదువుకుందామని బుద్ధి పుట్టింది. ఇంటరు అవగానే తిరిగి ఆలోచనలో పడ్డది. ఎందుకీ చదువు? ఉద్యోగం చెయ్యాలని యెప్పుడూ లేదు. పెద్దవాడయేవరకూ కొడుకుకు చెప్పడానికామె సంపాదించిన విద్య చాలు. సంస్కృతం తనకి కొట్టిన పిండే. అక్కడితో ఆ చదువాపింది.

మరొక్క సంవత్సరం గిఱ్ఱున తిరిగింది. దేశకాల పరిస్థితులనుబట్టి, అందరికీ హిందీ తెలిసి వుండాలన్న వాదం బయలుదేరింది. అంతా అంటే ముని మనుమలు మనుమరాళ్ళూ మొదలు ముత్తాతలు ముత్తవ్వలవరకూ. ఒకనాడు కుర్చీలో జేరబడి కూచుని చదువుతూన్న పేపరు బల్లమీద విసరి, అక్షరాలా యిలాగే అనుకుంది మనసులో. ఆమె క్రింద పెదవిమీద ఒక చిన్న మందహాసరేఖ మొలిచి సగంలో మాయమయింది. హిందీ చదవాలనుకుంది. అనుకోగానే ఆరంభించడం, ఆరంభించినదాని అంతు చూడడం సావిత్రి లక్షణం.

సావిత్రి భర్త కలకత్తాలో యింజనీరు పని చేస్తూండేవాడు. అతనితో పాపం మూడేళ్ళే కాపురం చేసింది. అతడు ఆమె నెంతో ప్రేమిం

అంగర వెంకట కృష్ణారావు

చేవాడు. లేకపోతే వెళిపోతూ వెళిపోతూ సావిత్రి మెడలో రఘు చిన్నారి రెండు చేతులూ యెందుకు తగిలించిపోతాడు? తనను మరిచి పోయిన క్షణంలో జ్ఞాపకం చెయ్యడానికి, దుఃఖ సమయంలో కన్నీళ్లు తుడవడానికి, వృద్ధాప్యంలో ఆసరా యివ్వడానికి. బహుశా తప్పటడుగు వెయ్యబోతే తత్క్షణ జ్ఞానం ప్రసాదించడానికి భార్యదగ్గర రఘుని విడిచి వెళ్లిపోయాడు.

కలకత్తాలో వుండే రోజులలో ఆమె బెంగాలీ వ్రాయడం చదవడం కూడా నేర్చుకుంది. శరత్, బంకిం, మైకేల్, టాగూరు మొదలైనవారి రచనలు చదివి జీర్ణించుకుంది.

విరగాస్తూన్న వెన్నెలలో ఆమె తెల్లని చీర చెరగు అప్పుడప్పుడు వీస్తూన్న చిరుగాలి కెగురుతూంటే ఆమె భూతకాలాన్ని నెమరువేసుకుంటూంది. ఆ ఆలోచనలు ఆమె హృదయపు లోతులలో చిన్న చిన్న అలలవలె లేచి, పొంగుతూంటే, నిసర్గమైన సహన శక్తితో వాటిని అదిమి మళ్లీ ఆ లోతులలోకే పంపుతూంది.

ఎనిమిది గంటలకు తాతా మనుమళ్లు ఇంటికి వచ్చేరు. శంకరంగారు సాలు గిళ్ల వాకిలిలోంచి తలపైకెత్తి 'సావీ' అని పిలిచేరు. 'అమ్మా' అని రఘు మేడమీదకు పరుగు తీసేడు. ఊహాపథంలో సంచరిస్తూన్న సావిత్రిని రఘు పిలుపు యీ ప్రపంచంలోకి తీసుకువచ్చింది. తల్లీ కొడుకు మధ్యమెట్టు దగ్గర కలిశారు.

సావిత్రి తండ్రితో కలిసి యెప్పుడూ భోం చెయ్యదు. యౌవనం పరవళ్లు తొక్కుతూన్న ఆమె శరీరం తండ్రి ముందుకు రాగానే అదొక విధమైన వినయంతో కుంచుకుపోతుంది. సాధారణంగా తండ్రి కాలి బొటనవ్రేళ్ళపై చూపు నిలిపి మాట్లాడేది.

ఆమె వంటింటిలో పనులన్నీ ముగించి వంట వాడిని సాగనంపి బైటకి వచ్చేసరికి చావడీలో శంకరంగారు, వాళ్లింట్లో అద్దెకున్న వెంకటేశ్వర్లు మాట్లాడుతున్నారు. వెంకటేశ్వర్లు గుండ్రబల్ల దగ్గర రోజ్‌వుడ్ కుర్చీమీద కూచున్నాడు. శంకరంగారు కొంచెం దూరంగా వాలు కుర్చీలో కూర్చున్నారు. వెంకటేశ్వర్లు చాలా నిమ్మళంగా మాట్లాడుతాడు. శంకరంగారు కొంచెం గట్టిగా మాట్లాడినా, అతి తాపీగా, నొక్కుతూ, అధికారపూర్వకంగావలె మాట్లాడతారు. అంచేత వారి సంభాషణ వంటింట్లోకి వినిపించదు.

చావడిలోకి వెళ్ళబోయి సావిత్రి ఆగిపోయింది. వెంకటేశ్వర్లు లేచి వెళిపోబోయేడు. శంకరంగారు చెయ్యి సూచనగా యెత్తి వారించేరు. గడియారం తొమ్మిది కొట్టింది. వెంకటేశ్వర్లు అటువెంపు చూసి, ఆవలింత నటించి, చిటికెలు వేసేడు. అది తనకి వస్తూన్న నిద్రని సూచించదని తనకేగాక శంకరంగారికి కూడా తెలుసును. సావిత్రి రాత్రి భోంచేసేక సుమారొక గంట చదువుకుంటుంది. ఆమె చదువుకు యెంత ఆలస్యం అయితే నిద్రకంత ఆలస్యం ఔతుంది.

శంకరంగారూ వెంకటేశ్వర్లూ వొకొక్కప్పుడు రాజకీయ విషయాలు మాట్లాడుకొనేవారు. వాటిలో యెవరి అభిప్రాయాలు వారివే. కాని సాంఘిక విషయాలు శంకరంగారు అధికారంతో చెప్తారు. ఎదుటివారు ఆయనతో యేకీభవించవలసిందని ఆయన అభిప్రాయం. సహజంగా పెద్దవారితో వాగ్వాదం చెయ్యని వెంకటేశ్వర్లు యే విషయంలోనూ శంకరంగారికెదిరి పక్షం కాడు.

శంకరంగారిదొక వింత ప్రకృతి. ప్లీడరీ చేసి చాలా ధనం ఆర్జించారు. ఎందరికో పెట్టేరు. సావిత్రి పుట్టిన నెలపురుడు తీరకుండా భార్య మరణించింది. ఆయన తిరిగి వివాహం చేసుకోలేదు. మన సాంఘిక వ్యవస్థలోవున్న పెద్దపెద్ద లోపాలవల్ల స్త్రీకి మిక్కిలి అన్యాయం జరుగుతున్నాదని ఆయన నమ్మకం. సాధారణంగా వెంకటేశ్వర్లుతో యీ విషయాలే కదుపుతూంటారు.

'విన్నావా బాబూ!' అతను ముగ్గుబుట్టలాంటి తలలోకి కుడివేళ్లు పోనిస్తూ అన్నారు: 'మా సావి హిందీ విశారద ప్యాస్ అయింది మొన్న పరీక్షలలో.'

అతను సావిత్రి గురించి మాట్లాడడానికి ఒక విధమైన మొహమాటం పడతాడు. ప్రక్కగదిలోంచి సావిత్రి చెవు లప్పజెప్పి వింటూంది. కాని అస్తమానం యిటువంటి విషయాలే యెత్తుతూంటాడు. అతనితో యెందుకి

భోగట్టా అనుకుని, అయినా అతడేం అంటాడో అని నిగాగా వింటూంది. వెంకటేశ్వర్లు వొళ్ళు విరుచుకుని, ప్రక్కగదిలో వున్న సావిత్రికి వినిపిస్తుందేమో అన్న భయంతో, ఆ భయం శంకరంగారికి కనిపిస్తుందేమో అన్న మరో భయంతో 'ఔను. విన్నాను. చాలా సంతోషం,' అన్నాడు నసుగుతూ. బంగారు గాజులు తీసి డ్రాయరులో పెడతూ సావిత్రి ఆమాటలకు గతుక్కుమంది. ఈ విషయం యెలా తెలియాలి? ఎందుకు తెలియాలి? ఎలాగో తెలిసిందే అనుకో, ఆ ఆఖరుమాట ఎందుకు?

శంకరంగారు ఆశ్చర్యంగా నవ్వుతూ తిరిగి ప్రశ్నించారు. 'ఎవరు చెప్పేరు?' ఈ ప్రశ్న సావిత్రిలో ఆత్రుత యెక్కువచేసింది. అతనికి తన నంబరు తెలుసునా? ఎలా తెలుసు? పోనీ యెప్పుడో యెవరినోటంటో వినివుంటే, ఫలితాలు చూడవలసిన అవసరం తనకేల కలిగింది? ఇలా వెళిపోతున్నాయామె ఆలోచనలు. వెంకటేశ్వర్లుకు ఆప్రశ్న మింగరాని ముద్ద అయింది. అది హాలాహలంలా రెండు సెకండ్లు నడుమ దహించింది. 'రఘుబాబు నాకు చెప్పేడు' అని గభీమని యెలాగో వెళ్లకక్కి చాలా భయపడిపోయేడు. శంకరంగారికా జవాబు సామాన్యంగానే తోచింది. సావిత్రి రవ్వల బేసరి వూడదీస్తూ 'వెధవ' అనుకుంది, రఘునుద్దేశించి.

'ఈ తరంలో ఆడవాళ్లు మగాళ్లతో సమానంగా చదువుకోవాలోయ్. దానివల్ల వాళ్లకి అట్టే ప్రయోజనం వుండదులే. కాని యీ సంస్కార రథం పరుగెడుతూంటే దాని చక్రాలకి కొంత బలిరక్తం కావాలి. ఆనెత్తురుమీంచే అది ప్రయాణించి స్వర్గధామం చేరుకుంటుంది. ఆ బలిదానం వీళ్లే చెయ్యాలి. వీళ్ళ పిల్లలూ, పిల్లల పిల్లలూ సుఖపడతారు. చూడూ, సావిత్రి వుందా...' లోపలనుంచి సావిత్రి యింక వినలేకపోయింది. గబగబ వెళ్ళి రేడియో వాల్యూము యెక్కువ చేసింది. ఈ విపరీతపు వృత్తికి కారణం బలహీనత కాదు. తన గురించి యెవరూ జాలిగా మాటాడకూడదు. జాలిపడినవాళ్లు తన కవమానం చేస్తారని యెప్పుడూ అనుకోదు. కాని ఆమె కిష్టంలేదు. అంతే.

వెంకటేశ్వర్లు మూడేళ్ళనించీ వాళ్ళింట్లో ఒక గది అద్దెకి తీసుకుని వుంటున్నాడు. ఇల్లు పెద్దదైనా అద్దెలకివ్వడం శంకరంగారి కిష్టం లేదు. ఇంట్లో స్థిరంగా వుండేవాళ్లు తక్కువైనా, వస్తూపోతూండేవారు యెక్కువ. ఇంటి యాజమాన్యం అంతా సావిత్రిదే. ఆమె యిష్టం లేకుండా ఆయింటిలో యేదీ జరగదు. వెంకటేశ్వర్లు ఆవూరికి వొక కంపెనీ వుద్యోగంమీద వచ్చేడు. ఆకంపెనీ అధికారికీ శంకరంగారికీ స్నేహం. స్నేహితుడు సిఫార్సు చేసేడనీ, వెంకటేశ్వర్లు కొక గది యిస్తే బాగుంటుందనీ, శంకరంగారు కూతురుతో అన్నారు. ఆమె చాలా ఆలోచించింది. అతని పూర్వాపరాలు తెలిసికోవాలని తండ్రిని చాలా ప్రశ్నలు వేసింది. తనసమ్మతిని మూడురోజులు వాయిదా వేసింది. విశాఖపట్టణంలో యిల్లు దొరకడం చాలాకష్టం. అతని చరిత్ర చాలా అజ్ఞాతంగానూ, అక్షేయంగానూ వుంది. చివరకి యేం అనుకుందో గాని యిమ్మంది. నాటినుంచీ వెంకటేశ్వర్లు వాళ్ళింట్లో నివసిస్తున్నాడు.

వెంకటేశ్వర్లు వస్తుతః మితభాషి. మొహమాటి. కలుపుగోలుతనం వుండాలని నమ్మినా అది ఆచరణలో పెట్టలేని వొకమాదిరి పిరికివాడు. కాని పిరికివాళ్లే వొకొక్కప్పుడు అంతరాత్మ ప్రేరణచేత సాహసాలు చేస్తారు.

అతడు తన గదిలో వుంటేనా లేకపోయినా లేనట్టే వుండేది. ఉదయం శంకరంగారు మేడ దిగి రాకపూర్వమే, స్నానం కాఫీ ముగించేవాడు. అంచేత ఆసంగతి శంకరంగారికి తెలియడానికి సావకాశం లేకపోయింది. వాళ్ళింటిలో దిగిన వెనక మొదటి ఆదివారం అతడు ఆలస్యంగా లేచేడు. అతడి గదిలో 'స్టౌ' హోరు పెడుతూంటే శంకరంగారు క్రిందికి దిగేరు. గుమ్మంవద్దకు వెళ్ళి తొంగిచూసేరు. కాఫీనీళ్లు మరుగుతున్నాయి.

'నాయనా వెంకటేశ్వర్లూ - నువ్వు కాఫీ పెట్టుకోకు. పాపం పొద్దున్న యేం చేతులు కాల్చుకుంటావు. కాఫీ యింట్లోంచి పంపిస్తుంది సావి' అన్నారు. 'మీకు యెందుకు శ్రమ' అని నీళ్లు నమలేడు. ఆనాటినుంచి కాఫీ శంకరం

గారింటిలోంచే వచ్చేది. హోటలులో భోంచేశే వాడు.

అప్పుడప్పుడు రఘు అతని గదిలోకి వెళుతూండేవాడు. రఘుతో మాత్రం ధైర్యంగా మాట్లాడేవాడు - అదైనా చుట్టుపక్కల ఎవరూ లేనప్పుడే. ఆ పిల్లవాడి విశాలమైన నుదురు, సన్నని సంపెంగ పువ్వువంటి ముక్కు, యెర్రని పెదవులూ చూస్తుంటే అతనికి చాలా ముచ్చట వేసేది. రఘు మేక పిల్లలా వుంటూనే పెంకెతనం చేసేవాడు. పెంకెతనంలోనే అమాయకత్వం వెలిబుచ్చేవాడు.

సంవత్సరం పైగా గడిచే వరకూ, సావిత్రీ వెంకటేశ్వర్లూ ఒకరి నొకరు చూసుకోలేదు సరిగా. కాని ఒకరి కంఠం ఒకరు వింటూండే వారు.

ఒకనాడుదయం సుమారెనిమిది గంటలకు సావిత్రికి రఘుమీద యెందుకో పట్టరాని కోపం వచ్చింది. వీపుమీద రెండు గట్టిగా చరిచింది. ఆ రెండు చరుపులూ గదిలోవున్న వెంకటేశ్వర్లు తన వీపుమీద పడ్డట్టు హడలిపోయాడు. సావిత్రి పాము బుసవంటి పుచ్ఛ్వాసనిశ్వాసాలు, బెట్టూ వింటూంటే యింకా కొడుతూందని నిశ్చయించుకున్నాడు. ఆమె కోపాగ్నిని చల్లార్చడానికి శంకరం గారన్నా యింట్లో లేరు. ఇంకో రెండు దెబ్బలూ, గుంజాయింపులూ వినిపించేయి. పిల్లవాడు విపరీతంగా యేడుస్తున్నాడు. కాని ఆమె కోపం తగ్గలేదు. పరమ శాంతులైన వారి హృదయ వనధులలో వుద్రేకాలు అణిగి మణిగి వుంటాయి కామోసు. అవి సులువుగా బైటకి రావు. వస్తే యిదిగో యిలాగే!

రఘు మెల్లిగా తల్లిపట్టు తప్పించుకొని వెంకటేశ్వర్లు గదిలో దూరేడు. రాగానే వెంకటేశ్వర్లు అతనిని వడిలోకి తీసుకుని బుజ్జగించ సాగేడు. బైట సావిత్రి కోపాగ్నిమీద నేయి పడింది. ఆమె నాసికా పుటాలుబ్బిపోతున్నాయి. 'రఘూ' అని ఆమె వేసిన కేక వెంకటేశ్వర్లు వెన్నెముకలో శూలంలా గుచ్చుకొంది. కాని అతడు రఘునిమాత్రం విడవలేదు. ఆమె అలాటి శూలాలు రెండు మూడు విసిరింది. అతడికి ముచ్చెమటలు పోసిపోయేయి. చివరకి ఆమె 'విధవా! పైకి రా, నిన్ను మారణహోమం చేస్తా'


# ఆంధ్ర బ్యాంక్ లిమిటెడ్

హెడ్డాఫీసు : మచిలీపట్టణము

అధికారము పొందబడిన మూలధనము

రు. 1,00,00,000

చందా వేయబడి జారీచేయబడిన మూలధనము

48,99,000

| | |
|---|---|
| చెల్లించబడిన మూలధనము | 25,00,000 |
| రిజర్వు ఫండు | 9,00,000 |
| డిపాజిట్లు | 5,00,00,000 |

అమలులోవున్న వ్యాపారము మొత్తం రు.6,00,00,000కు మించినది.

ఫిక్సెడ్ డిపాజిట్లు:-నూరు రూపాయలకు తక్కువగాని మొత్తములు 3, 6, 12, 24 మాసములకు అన్ని బ్రాంచీలలోను తీసుకొనబడుచున్నవి.

3 సంవత్సరముల క్యాషు సర్టిఫికెట్లు ఈ బ్యాంకులో ప్రత్యేక సౌకర్యము. అన్నిరకముల చెక్కులు, డ్రాఫ్టులు, డివిడెండ్లు, వారంట్లు, హుండీలు వసూలుచేసి పెట్టబడును.

గవర్నమెంటుపత్రములు, షేర్లుకొనుట అమ్మట మొదలగు వ్యాపారములుకూడ చేయబడును.

వివరము లే ఆఫీసులోనైనను తెలిసికొనవచ్చును.

తాడేపల్లి శ్రీరాములు
మేనేజింగ్ డైరెక్టర్.

వారణాసి కృష్ణమూర్తి
ఎం.ఏ.బి.కాం., ఎల్.ఎల్.బి., సి.ఎ. ఐ.ఐ.బి.,
జనరల్ మేనేజరు.

నని తన పని చూసుకో బోయింది. అతడు 'ఆడది!' అనుకున్నాడు బిక్కు బిక్కులాడే మనసులో.

అతడికి స్నేహితు లున్నారో లేదో ఎవ్వరూ యింటికి రారు. తనుకూడా సాధారణంగా బయటికి వెళ్ళడు. ఎల్లప్పుడూ చదువుతో కాలక్షేపం చేస్తాడు. అతడు మంచి రూపవంతుడు. అతడి కళ్ళమధ్య నిగనిగలు మెరుస్తూ చూసేవారిని ఆకర్షిస్తూంటే, ఆ కళ్ళ కొసలతో పిరికితనం కరిగి చెదిరి లక్ష్యం గురి తప్పిస్తుంది. ఈ మూడేళ్ళలోనూ శంకరంగారతని పిరికితనం చాలావరకూ పోగొట్టేరు. కాలక్రమేణా అతడు వారింటిలో వొకడుగా, వాళ్ళలో వాడు కాజొచ్చేడు. విచిత్రమేమంటే శంకరంగారెన్నడూ అతని చరిత్ర అడగలేదు. అతడుకూడా మాటల సందర్భంలోనైనా ఆ వూసెత్తలేదు. తను బరంపురంనుంచి వచ్చేడని మాత్రం వాళ్ళ కెలాగో తెలుసు. అందుకే శంకరంగారు 'మీ బరంపురంలో మంచి రసగుల్లా దొరుకుతుందోయ్. అలాంటిది మళ్ళీ కలకత్తాలోనే గాని యీ మధ్య దొరక'దనే వారు.

ఆ మరుచటి యేడే శంకరంగారు పోయేరు. ఆయన పదిహేను రోజులు మంచంమీద తీసుకున్నాడు. పెద్దప్రాణం-దురదృష్టజీవిని అయిన కూతురునూ, పసివాడైన రఘునీ విడిచి వెళ్ళలేక వెళ్ళలేక వెళ్ళేరు.

ఆయన జబ్బురోజులలో వెంకటేశ్వర్లు చెప్పలేనంత కష్టపడ్డాడు. పగలు సావిత్రి, రాత్రి వెంకటేశ్వర్లు రోగిదగ్గరుండేవారు. తన రాత్రి డ్యూటీ మిలిటరీ డ్యూటీలా చేసేవాడు. శంకరంగారు పగలు కొద్దిగా నిద్రపోయేవారు. రాత్రిళ్ళు చాలా హైరాణ పడేవారు. వెంకటేశ్వర్లును వందసార్లయినా పిలిచేవారు. అతడలా పోతవిగ్రహంలా కూచుని ఆయన కళ్ళు తెరవడమే తడవుగా దగ్గరకెళ్ళేవాడు.

ప్రక్కగదిలోనే పడుకున్న సావిత్రి కప్పుడప్పుడు తెలివి వస్తూండేది. తెలివి వచ్చినప్పుడల్లా తండ్రి 'వెంకటేశ్వర్లూ' అని పిలవడం వినేది. నిద్రపట్టిపోతుందేమో అని అతడు వాలుకుర్చీమీద కూచోక, కొయ్య కుర్చీమీద జగన్నాథ విగ్రహంలా కూచునేవాడు.

ఒకనాటి తెల్లవారుఝామున ఏడు గంటలకు గది నిశ్శబ్దంగా వుంది. సావిత్రికి తెలివి వచ్చింది. నెమ్మదిగా లోనికి వెళ్ళింది. తండ్రికి చిన్న నిద్రపట్టింది. వెంకటేశ్వర్లు అలా కూచునే నిద్రపోతున్నాడు, అతడిని చూడగానే ఆమెగుండె ద్రవించింది. మూతపడివున్న అతని కళ్ళు కప్పలలా వుబ్బివున్నాయి. అతడచేతనంగా వున్నా అతని పెదవులు కొంచెం కదులుతున్నాయి, ఆమె అలా చూస్తూ నిలబడిపోయింది. అతనికి హఠాత్తుగా తెలివి వచ్చింది. కళ్ళు విప్పేసరికామె అగుపించింది. అతడు గాభరాపడ్డాడు. 'క్షమించండి' అని గొణిగేడు ఆమెవేపు చూడకుండా. చూసేవుంటే ఆమె బుగ్గలమీద మెరిసే కన్నీటిచుక్క లెలా అగుపించకుండా వుంటాయి?

చివర మూడు రోజులూ ఆఫీసుకు శలవు పెట్టి, రాత్రింబవళ్ళు శంకరంగారి శయ్యదగ్గర మేకుబందీ అయిపోయేడు! సావిత్రి బెంగలో మునిగిపోయి అతనితో ముఖా ముఖిని మాట్లాడనారంభించింది. అతడు భోజనం కాఫీ మరిచిపోయేడు. దగ్గుత్తికతో ఆమె అతనిని బ్రతిమాలేది భోజనానికి వెళ్ళమని. అత్రుతకొద్దీ అతను డాక్టరుగారింటికి పరుగెత్తి నప్పుడు ఆమె యెంతో ఒంటరితనం అనుభవించేది. చివర రోజులలో యెంతోమంది బంధువులు వస్తూండేవారు విచారించి కాఫీలు తాగి వెళిపోవడానికి. కాని వారెవ్వరి వునికీ ఆమెకు ధైర్యం యివ్వలేదు. తండ్రి బతకడని తోచినప్పుడల్లా వెంకటేశ్వర్లుమీదే తన భావిజీవితం, ఆయిల్లు, సర్వం ఆధారపడి వున్నాయనిపించేదామెకి. ఆ మూడు రోజులలోనూ పసివాడైన రఘుకూడా బెంగపడి కిం అనలేదు.

శంకరంగారు పోవడానికి పది నిమిషాల ముందు కళ్ళు తెరిచేరు. ఆయనకి బాగా తెలివి వచ్చింది. కాని మాట పడి పోయింది. సావిత్రి రఘుని ముందు పెట్టుకుని వెక్కుతూంది. వెంకటేశ్వర్లు అవనత వదనంతో అవతల పక్క చిన్న ముక్కాలి పీటమీద కూచున్నాడు. శంకరంగారొకమారులుగు మూలిగేరు. వెంకటేశ్వర్లు తలయెత్తేడు. ఆ సుదూర ప్రయాణికుడొకసారి వెంకటేశ్వర్లు ముఖంకేసి ఆశగా చూసి,

ఆ చూపు నిమ్మళంగా సావిత్రివేపూ, తరవాత రఘువేపూ త్రిప్పేడు. ఆ నేత్రాల వేడి అశ్రుజలంలో యేదో కోరిక కరిగి కళవెళ మరిగిపోతూంది. ఆ నేత్రాలు తిరిగి వెంకటేశ్వర్లును ఒక్కసారిచూసి శాశ్వతంగా మూసుకున్నాయి.

చూడవచ్చిన బంధువులు సినిమా అయిన వెనక ప్రేక్షకులవలె వెళిపోయేరు. ఇల్లు 'దిం' మంటూంది.

శంకరంగారు విల్లువ్రాయించి వెంకటేశ్వర్లుకిచ్చేరు. అతడందులో సాక్ష్య సంతకం పెట్టేడు. యావదాస్తీ సావిత్రికి, తదనంతరం రఘుకి చెందవలసినదిగా దానిలో వుంది.

వెంకటేశ్వర్లుకి మరి తను యింటిలో వుండవలసిన అవసరం అగుపడలేదు. అతని హృదయం భరించలేనంత బాధపడింది. శంకరంగారు పోయిన నెల తరవాత ఒకరోజున తన సామానులన్నీ సర్దుకున్నాడు.

సావిత్రి గుండ్రబల్లవద్ద కుర్చీమీద కూచుని వుంది. ఆమె దగ్గరకు వెళ్లి, 'వీలు' వున్న కవరు బల్లమీద పెట్టేడు. ఆమె దిగులు కళ్లతో అతని వేపు చూసింది.

'సావిత్రిగారూ! ఇది మీ నాన్నగారు యావదాస్తీ మీ పేర వ్రాయించి యిచ్చిన విల్లు. దీనిని భద్రంగా దాచి పెట్టుకోండి' అన్నాడు. ఆమెకు ఆశ్చర్యం వేసింది. ఆ సంగతి జరిగిందని కాని, అలా జరగాలని కాని, ఆమె యెన్నడూ అనుకోలేదు. ఆమెవైదుష్యాని కిలాంటి విషయం అవగాహన చేసుకోవలసిన అవసరంలేకపోయింది. కాని యిప్పుడు కలిగింది. 'నేను వెడుతున్నాను. శలవు' అన్నాడు. ఆమె తలదించుకుంది. ఆమె గుండెలలో రాయి పడ్డది. 'ఒంటరిగా జీవించ దలచుకున్నాను. తిరిగి యిలాంటి దెబ్బ తగలకూడదని నా కోరిక' అని వెనక్కి తిరిగిపోయేడు. ఎంత ప్రయత్నించినా ఆమె దుఃఖం ఆపుకోలేకపోయింది. తండ్రి యిప్పుడు పోయినట్టు, యిప్పుడే తను పూర్తిగా అనాధ అవుతూన్నట్టయింది, తనగది వరకూ వెళ్ళిన వెంకటేశ్వర్లు కామె వెక్కి వెక్కి యేడుపులు వినిపించేయి అతడు తిరిగి ఆమె వద్దకు వచ్చేడు.

'ఏడుస్తున్నారా' నెమ్మదిగా అన్నాడు. ఆమె కాదన్నట్టు తలవూపింది. ధైర్యాన్ని గాలిగా మూటగట్టడానికి ప్రయత్నించింది. కాని ఆ మూటను యెంతబిగించితే అది అంత పుబికిపోజొచ్చింది. తను యెంత చదువుకుంటేనేం, తనకెంత డబ్బుంటేనేం, ఏ స్త్రీ అయినా జీవితంలో యేదో ఒక విషమస్థితిలో ఒక పురుషుడి మీద ఆధార పడక తప్పదు. లేకపోతే పందిరి లేని లతవలె నేలమీద కూలి వాడిపోయి మాడి పోవసిందే. (అనుభవహీన అయిన ఆధునిక తరుణి యీ వాక్యానికి మండిపడుతుంది తప్పకుండా.) ఆమె తలయెత్తింది. 'మీరు వెళ్లకండి! విధికంటె కాఠిన్యం వహించకండి.' అతడామె కళ్లలోకి చూసేడు. అవి ఆఖరునిముషంలో శంకరంగారి కళ్లు!

(ముగింపు వచ్చేసంచికలో)

---

డాక్టర్: ఇవ్వాళ మీ భర్తకు విశ్రాంతీ, హాయీ ఉండాలి. ఇదుగో నిద్ర మందు.

ఆమె: ఈ మందును వారికి ఎప్పు డివ్వమంటారు?

డాక్టర్: వారికి కాదు, తమకే.

* * * *

ఒకడు: ఏమండీ, వారంనుంచి మా ఆవు కనబడడంలేదండీ, ఎక్కడ మారుపడిపోయిందో ఏమో?

ఇంకొకడు: పోనీ, ఏదైనా పత్రికలో ప్రచురించ లేకపోయారా?

మొదటి వ్యక్తి: ఏం ప్రయోజనం? ఆవులు పత్రికలు చదువుతాయా ఏమన్నానా?